దుబాయిలో జిల్లావాసి హత్య.. సోన్‌లో విషాదం



సోన్ మండల కేంద్రంలో ప్రేమ్‌సాగర్ స్వగృహం

సోన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబాన్ని ఉన్నతంగా పోషించాలన్న ఆలోచనతో దుబాయి దేశానికి వెళ్లి ఉద్యోగం చేసుకుంటున్న జిల్లాకు చెందిన ఓ యువకుడు అక్కడ ఓ ఉన్మాదిచేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. అందిన సమాచారం మేరకు.. పాకిస్తాన్ దేశానికి చెందిన ఓ యువకుడు కత్తితో దారుణంగా నరికి చంపాడు. ఈ సంఘటనలో ఇతనితో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన మరో యువకుడు హత్యకు గురయ్యారు. ఆష్టం ప్రేమ్ సాగర్ 2006 సంవత్సరం నుంచి గల్ఫ్ దేశానికి వెళ్తున్నాడు. ఇండియా వచ్చి మళ్లీ గల్ఫ్ దేశానికి వెళ్లి గత రెండున్నర సంవత్సరాలు అవుతోంది. ప్రేమ్‌సాగర్ 11వ తేదీన శుక్రవారం రాత్రి 7 గంటలకు భార్య ప్రమీలతో చివరగా ఫోన్‌లో మాట్లాడాడు. అక్కడి మోడన్ బేకరీ కంపెనీలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. హత్య ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అందరితో కలుపుగోలుగా ఉండే ప్రేమ్‌సాగర్ పాకిస్తాన్‌కు చెందిన ఉన్మాది చేతిలో మరణించడంతో సోన్‌లో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుడికి భార్య ప్రమీల, ఇద్దరు కూతుళ్లు, తల్లిదండ్రులు ఫకీర్, లక్ష్మీ ఉన్నారు.

ప్రేమ్‌సాగర్ కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే ఏలేటి

సోన్ మండల కేంద్రానికి చెందిన ఆష్టం ప్రేమ్‌సాగర్ దుబాయ్‌లో మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే స్పందించి విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారులతో, రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌ఆర్‌ఐ సెల్ అధికారులతో మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృతదేహాన్ని తెప్పించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీకి వినతి

కలెక్టర్ అభిలాష అభినవ్‌కు, అదే విధంగా ఎస్పీ జానకి షర్మిలకు మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని రజక సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు.

రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం : విఠల్‌రెడ్డి

కుంటాల, ఏప్రిల్, 15 : (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా రైతుల పక్షాన ఉంటుందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొంత మందికి రుణమాఫీ, రైతు భరోసాను అందించలేకపోయినప్పటికి రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి రైతు భరోసా, రుణమాఫీ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాలలో పలువురు లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముథోల్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సీఎం సహాయనిధితో పాటు ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కార్యకర్తలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. గతంలో ధరణి పోర్టల్ వల్ల రైతుల ఇబ్బందిని చూసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించారని, రాబోయే రోజుల్లో రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి కింద మంజూరైన నర్సాపూర్ (జీ), కుంటాల మండల లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ పలువురు ఉన్నారు.



అమ్మకు రక్షణ

- మాతా, శిశు మరణాల కట్టడికి యాక్షన్‌ప్లాన్
- జిల్లాలో ప్రయోగాత్మకంగా అమ్మ రక్షిత కార్యక్రమం
- వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు
- గర్భిణుల ఆరోగ్యం, పోషకాహారంపై రోజు వారీ సమీక్ష
- జిల్లావ్యాప్తంగా గర్భిణుల గుర్తింపు
- అన్ని పీహెచ్‌సీల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

నిర్మల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాతా శిశు మరణాలను అరికట్టేందుకు వైద్యఆరోగ్యశాఖ ప్రయోగాత్మకంగా వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే అమ్మ రక్షిత పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్యశాఖ రూపొందించింది. జిల్లాలోని మెటర్నిటీ హాస్పిటల్‌తో పాటు 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అమ్మ రక్షిత కార్యక్రమాన్ని అమలు చేయతలపెట్టారు. దీని కోసం గానూ వైద్యఆరోగ్య శాఖ ఓ రూట్‌మ్యాప్ సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌యంలు, ఆశావర్కర్లు ఓ టీమ్‌గా ఏర్పడి వారి పరిధిలో మాత శిశు సంరక్షణ కోసం యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తున్నారు. దీనికి అనుగుణంగా గర్భస్థ మహిళలకు అలాగే ప్రసవ మహిళలకు ఓ వైపు సరియైన పోషకాహారాన్ని అందేట్లు చూస్తూనే మరోవైపు వైద్య సహాయాన్ని కూడా అందించనున్నారు. కాగా ఈ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించారు. జిల్లాలో 5037 మంది గర్భిణులు ఉండగా వీరిలో 2163 మంది గర్భిణులు హైరిస్క్‌తో ఉన్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. హైరిస్క్ ఉన్న గర్భిణులపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు. వారికి కార్డియాలజిస్ట్ ద్వారా 2డీ ఎకో కన్సల్టేషన్ సేవలను సైతం అందించనున్నారు. అలాగే వారినికొసారి గైనకాలిజిస్టల ద్వారా టెలీకన్సల్టెషన్ సేవలను అందించనున్నారు. ప్రసవానంతరం సైకోసిస్, ఆందోళన డిప్రెషన్‌తో బాధపడే తల్లులకు సైకియాటిస్టల చేత కౌన్సిలింగ్‌లు కూడా నిర్వహించనున్నారు. దీంతో పాటు ఆయూష్ విభాగం వైద్యులతో గర్భవతులకు యోగాసెషన్స్ కూడా నిర్వహించేందుకు నిర్ణయించారు. అలాగే పోషకాహార నిపుణుల చేత గర్భవతులందరికి వారు తీసుకోవాల్సిన ఆహారంపై సలహాలు అందించనున్నారు. ముఖ్యంగా హైరిస్క్ ఉన్న గర్భవతుల కోసం ఇక్కడి గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్‌డెస్క్ 24/7 మొత్తం ఐదుగురు సిబ్బందిని నియమించి వారి చేత హైరిస్క్ గర్భవతులకు ఎప్పటికప్పుడు వైద్య సలహాలతో పాటు వారికి అండగా నిలిచేందుకు హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ సిబ్బంది టోల్‌ఫ్రీ నెంబర్‌తో హైరిస్క్ ఉన్న గర్భవతులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యసిబ్బంది ఫోన్ చేసి తగిన వైద్య సలహాలు, సూచనలతో పాటు పోషకాహారంకు సంబంధించి కూడా సలహాలు అందిస్తారు.

ప్రత్యేక కమిటీ నియామకం

కాగా జిల్లాలో అమ్మ రక్షిత ప్రోగ్రాంను పకడ్బందీగా అమలు చేసేందు కోసం హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో హెడ్‌ఓడీతో పాటు మెటర్నిటీ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీసీహెచ్‌లు సభ్యులుగా ఉంటారు. ప్రతీవారం రోజులకు ఒకసారి ఈ హై పవర్ కమిటీ హైరిస్క్ గర్భిణుల పరిస్థితులపై సమీక్ష జరపాల్సి ఉంటుంది. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులతో పాటు వారికి మానసికంగా కౌన్సిలింగ్‌లు నిర్వహించడం అలాగే సరియైన పోషకాహారం అందుతుందా అనే అంశాన్ని కూడా ఈ హై పవర్ కమిటీ తెలుసుకోనుంది. వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి గర్భిణులకు పూర్తిస్థాయిలో సహకారం అందే విధంగా ఈ కమిటీ పర్యవేక్షణ చేయనుంది.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం

అమ్మ రక్షిత ప్రోగ్రాంలో నార్మల్ డెలవరీలకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. సిజేరియన్‌లను తగ్గించి నార్మల్ డెలవరీలను పెంచేందు కోసం ఈ ప్రోగ్రాం ద్వారా సమిష్టిగా చర్యలు చేపట్టనున్నారు. పీహెచ్‌సీల స్థాయిలోనే గర్భిణులకు మెరుగైన వైద్య సహాయంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులు అలాగే మానసిక స్థితిగతులను తెలుసుకొని అందుకు అనుగుణంగా వారికి సహాయం అందించాలని నిర్ణయించారు. నార్మల్ డెలవరీల కోసం మొదట గర్భిణులకు మానసికంగా ధృడం చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు సైతం కౌన్సిలింగ్‌లు నిర్వహించి వారిని ఆ దిశగా సంసిద్ధం చేయనున్నారు. గత కొంతకాలం నుంచి సిజేరియన్ ఆపరేషన్‌లు పెరిగిపోతున్న నేపథ్యంలో అమ్మ రక్షిత కార్యక్రమం ద్వారా వాటిని తగ్గించి నార్మల్ డెలవరీలను ఎక్కువ సంఖ్యలో జరిగేట్లు చర్యలు తీసుకోనున్నారు.

అన్ని పీహెచ్‌సీల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలతో పాటు మానసికంగా వారికి సలహాలు అందించేందు కోసం హెల్ప్‌డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలోని గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్‌తో పాటు భైంసాలోని ఏరియా హాస్పిటల్స్‌లో ఈ రెండు హెల్ప్‌డెస్క్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ గర్భిణీ మహిళలకు నార్మల్ డెవలరీల కోసం వ్యాయామం, యోగ పోషకాహారం లాంటి అంశాలపై సలహాలు అందించనున్నారు. దీంతో పాటు సైకాలజిస్ట్ ద్వారా కౌన్సిలింగ్‌లు కూడా నిర్వహించనున్నారు. ముఖ్యంగా రక్తహీనత లోపం ఉన్న మహిళలను గుర్తించి వారికి బలమైన పోషకాహారంపై సలహాలు అందించనున్నారు.

అమ్మ రక్షితను పకడ్బందీగా అమలు చేస్తాం

• డాక్టర్ రాజేందర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి



గర్భిణుల రక్షణ కోసం అమ్మ రక్షిత కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తాం. ముఖ్యంగా నార్మల్ డెలివరీస్‌పై ఎక్కువగా దృష్టి సారిస్తాం. గర్భిణులకు వైద్య పరంగానే కాకుండా మానసికంగా, పోషకాహార పరంగా అన్ని రకాల సేవలు అందిస్తాం. ప్రతీవారం ఈ కార్యక్రమం అమలు తీరును హైపవర్ కమిటీ పర్యవేక్షిస్తుంది. హైరిస్క్ ఉన్న గర్భిణుల కోసం హెల్ప్ డెస్క్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం.

ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియను

త్వరితగతిన పూర్తి చేయాలి

• అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ (ముగ్గు వేసే ప్రక్రియ) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పూర్తి చేసిన మార్కింగ్‌కు సంబంధించిన వివరాలను అధి కారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియను త్వరితగిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్‌శాఖ ఏఈ మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ప్రక్రియను దగ్గరుండి చేయించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో గోవింద్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో పోలీసు అక్కలు మమేకం : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వినూత్నంగా జిల్లాలో ఒకేరోజు 18 పాఠశాలల్లో నిర్వహిస్తున్న పోలీసు కార్యక్రమంతో మహిళా పోలీసులు విద్యార్థులతో మమేకమవుతున్నారని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అక్క కార్యక్రకమం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందరభంగా ఎస్పీ మాట్లాడుతూ... పాఠశాలల్లో విద్యార్థులతో బస చేసి వారి మంచిచెడ్డలు తెలుసుకొని వారికి దగ్గరవుతున్నారన్నారు. వారి సమస్యలు పోలీసు అక్కలకు తెలియజేయడం వల్ల సగం భారం తగ్గుతుందని తెలిపారు. మానసికంగా విద్యార్థినులను ఉత్తేజపర్చాలని సూచించారు. పలు సలహాలు వారికి అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు ప్రాముఖ్యత తెలియజేయాలన్నారు. మానసిక, శారీర ఆరోగ్యం కోసం వారితో యోగాభ్యాసం చేయించాలన్నారు. చురుగ్గా పని చేస్తున్న పోలీసు అక్కలను ఎస్పీ అభినందించారు. ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేష్ మీనా, ఇన్స్‌పెక్టర్లు అజయ్, నైలు, గోపినాథ్, మల్లేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఏఎస్పీ



లక్ష్మణచాంద, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా అన్నారు. మండంలోని మునిపెల్లి గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. గ్రామంలో గల ద్విచక్ర, బహుళ చక్ర వాహనాలను, ఇతర మోపెడ్ వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 90 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సదరు వాహనాలకు జరిమానా విధించి, హెచ్చరికలు జారీ చేసి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా స్థానికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు రహమాన్ మాలిక్, గోపి, ఏఎస్సైలు షౌకత్ అలీ, శ్రీనివాస్‌వర్మ, హెడ్ కానిస్టేబుళ్లు వాహిద్ ఖాన్, శంకర్, పోలీస్ కానిస్టేబుళ్లు అశోక్, కిరణ్, గంగాధర్, నరేష్, విజయ్, రఘు, సాయి, హరీష్, శ్రీలత, నిషిత, హోంగార్డ్స్ మారుతి, సురేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం ప్రకారమే

భూ బదలాయింపులు చేపట్టాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అభివృద్ధి పనుల నిర్వహణలో అటవీభూముల వినియోగానికి సంబంధించి ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అటవీ భూములపై చేపట్టే అభివృద్ధి పనులకు పరివేశ్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయిలోనే మంజూరు చేయగల అనుమతులను వేగంగా చేర్పించి, అభివృద్ధి కార్యక్రమాలు ఆపకుండా కొనసాగేలా చూడాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీభూముల్లో రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ప్రాజెక్టులు, పంచాయతీ భవనాలు తదితర నిర్మాణాల కోసం తప్పనిసరిగా పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఒకవేళ ప్రతిపాదిత ప్రాజెక్టు టైగర్ రిజర్వ్ జోన్‌లో ఉంటే కేంద్ర, రాష్ట్ర వైల్డ్ లైఫ్ అధికారుల అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి అటవీశాఖ రెవెన్యూ, విద్యుత్, ఇంజనీరింగ్ శాఖలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. అనంతరం పరివేశ్ పోర్టల్ గురించి అధికారులకు అవగాహన కల్పించారు.

భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

భూ భారతి చట్టంపై ప్రతి అధికారి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్)- 2025 చట్టంపై రెవెన్యూ అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి అధికారులంతా గ్రామాల్లో గ్రామసదస్సులు ఏర్పాటు చేసి గ్రామస్థులకు, రైతులకు భూ భారతి చట్టంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల వివరాలు సేకరించాలన్నారు. భూ భారతి చట్టాన్ని సమర్థ వంతంగా అమలు పరచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, నూతనచట్టం ప్రకారం భూములకు భూదార్ కార్డులు మంజూరు చేసే వెసులుబాటు కల్పించారని తెలిపారు. భూ విషయాలకు సంబంధించి చిన్న చిన్న సవరణల ప్రక్రియ అత్యంత సులువుగా, వేగంగా పూర్తవుతుందని తెలిపారు. అనంతరం చట్టంలో పొందుపరిచిన అన్ని అంశాలను కూలంకశంగా సుదీర్ఘంగా అధికారు లకు కలెక్టర్ వివరించారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డిలు, తహసీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

• సిర్గాపూర్ వద్ద ప్రమాదంలో తండ్రి దుర్మరణం • కొడుకుకు తీవ్రగాయాలు • చిట్యాల బ్రిడ్జిపై ఒకరి మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం



రాజు మృతదేహాన్ని వాహనంలో ఎక్కిస్తున్న ఎస్సై సందీప్



చిట్యాల వద్ద ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్గాపూర్ సమీపంలో 61వ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కొడుకు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే... మహారాష్ట్రలోని హిమాయత్ నగర్ తాలూకలోని దాబ్దారి గ్రామానికి చెందిన దిద్దోలి రాజు(45), లక్ష్మీబాయి దంపతులు కొడుకు, కూతురుతో సహా జీవనోపాధి కోసం నర్సాపూర్(జి) మండలం టెంబుర్నికి వచ్చారు. ఇక్కడ ఇటుక బట్టీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. అయితే ఇటుక బట్టీలో పని చేస్తున్న మిగతా కార్మికులు అంతా కలిసి అడెల్లి పోచమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు అడెల్లికి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. మంగళవారం ఉదయం కార్మికులందరూ కలిసి అడెల్లికి వెళ్లారు. భార్య లక్ష్మీ బాయి, కూతురును వారి వెంట పంపిన రాజు నిర్మల్‌లో బైక్ మరమ్మతులు చేయించుకుని అడెల్లికి వస్తామని భార్యతో చెప్పి కొడుకు కేదార్‌నాథ్‌ను బైక్‌పై ఎక్కించుకుని నిర్మల్ వెళ్లాడు. నిర్మల్‌లో బైక్ మరమ్మతు చేయించుకునేసరికి సాయంత్రం కావడంతో అడెల్లికి వెళ్లకుండా బైక్‌పై తిరిగి వారు పనిచేసే ప్రదేశానికి బయలుదేరారు. సిర్గాపూర్ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక కాలు తెగి దూరంగా పడింది. ఆయన కొడుకు కేదార్‌నాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కేదార్‌నాథ్‌ను 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించి, ఎస్సై లోక సందీప్ వెంటనే రాజు మృతదేహాన్ని మరో వాహనంలో పోస్టుమార్టం కోసం నిర్మల్ తరలించారు. మృతుడి భార్య లక్ష్మీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

చిట్యాల బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల బ్రిడ్జిపై మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మొదటగా లారీ, బైక్ ఢీకొనడంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేడ్ వేయడంతో వెనుక వచ్చిన బైక్ లారీని ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కృష్ణ మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, వారిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

గాజులపేట్‌లో దొంగల బీభత్సం

• పట్టపగలే రెండిళ్లల్లో చోరీ

• తాళాలు పగలగొట్టి చొరబడిన దుండగులు




నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ వీధిలో పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. పక్కపక్కనే గల రెండు ఇళ్ల తాళాలను పగలగొట్టి పెద్ద ఎత్తున దొంగలు చోరీకి పాల్పడ్డారు. షేక్ సాబీర్ అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడిన దుండగులు ఆ ఇంట్లోని బీరువాలను పగలగొట్టి మూడున్నర తులాల బంగారం, 20 వేల నగదును ఎత్తుకెళ్లారు. అలాగే ఇదే ఇంటి పక్కన ఉన్న మహ్మద్ అన్వర్ అహ్మద్ అనే వ్యక్తి ఇంటి తాళాలను పగలగొట్టిన దొంగలు ఆ ఇంట్లోనే బీరువాను పగలగొట్టి 80,000ల నగదు, మూడు తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. ఎప్పుడు రద్దీగా ఉండే గాజులపేట్ వీధిలో పట్టపగలు దొంగలు రెండు ఇళ్ల తాళాలను పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన వ్యవహారం స్థానికంగా కలకలం రేపుతోంది. అయితే బాధితులు వెంటనే ఈ సమాచారాన్ని పోలీసులకు తెలపడంతో పోలీసులు ఈ దిశగా విచారణ జరుపుతున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దొంగల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

కడెంలో దొంగతనం



కడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లింగాపూర్ గ్రామంలో పడాల గంగవ్వ అనే మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. తన ఇంట్లో బీరువాలో 3 తులాల బంగారు, 10 తులాల వెండి, 1,50,000 రూపాయల నగదును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న మొత్తం దొంగలించారని ఆ మహిళ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కడెం ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సోన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులోని సరస్వతి కాలువ పక్కన గల రోడ్డు వద్ద గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే... మృతుడికి 55 నుండి 60 సంవత్సరాలు ఉంటాయని, తల వెంట్రుకలు పొడవుగా ఉండి, తెలుపు, నలుపు గడ్డం కలిగి ఉన్నాడు. బట్టలు మాసిపోయి ఉన్నాయని, చూడడానికి మతిస్థిమితం లేని వ్యక్తిగా కనిపిస్తున్నాడని కడ్తాల్ సర్పంచ్ బర్మ గంగ నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన పీపీ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది బి.ప్రవీణ్ కుమార్ ఆదిలాబాద్ జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కోర్టులో అడిషనల్ జిల్లా న్యాయాధికారి డాక్టర్ పి.శివప్రసాద్‌కు జాయినింగ్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రమణ రెడ్డి, అడిషనల్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.సంజయ్ కుమార్, ప్రభుత్వ న్యాయవాది పి.దయాకర్, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహీం, న్యాయవాదులు, తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

జైనథ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కలిగి ఉండాలని జైనథ్ ఏపీఎం నాగుల భగవండ్లు అన్నారు. మంగళవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సిర్సన్న(జె)లో మహిళ రైతులకు నిర్వహించిన ఎస్‌పీఎం అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని అన్నారు. రైతులు ఆవు పేడ, ఇతర సేంద్రియ ఎరువులను వాడి కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ నాందెవ్, సీఆర్‌పీలు ఆశన్న, భాగ్యలక్ష్మిలతో పాటు కూర కరంజి, సిర్సన్న జె గ్రామాలరైతులు పాల్గొన్నారు.

500 దేశీదారు బాటిళ్ల స్వాధీనం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం తరలిస్తున్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన అలిశెట్టి అభిలాష్‌ను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ మంగళవారం అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని చనాక నుంచి దేశీదారు సీసాలను తీసుకువస్తుండగా భీంసరిలో ఆయనను పట్టుకున్నట్లు తెలిపారు. ఆయన వద్ద నుంచి రూ.18 వేల విలువైన 500 దేశీదారు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు : ఎస్సై

నేరడిగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని అంకిత్ దాబా పక్క గంజాయి విక్రయిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు సోదాలు చేశామన్నారు. మండల కేంద్రానికి చెందిన రమేష్, రోల్‌మామడ గ్రామానికి చెందిన దత్తురాం వద్ద 110 గ్రాముల గంజాయి లభించిందని ఎస్సై అన్నారు. వీరిద్దరూ మండలంలోని ఇక్షుగూడకు చెందిన కాశీరాం వద్ద గంజాయి కొనుగోలు చేశామని చెప్పడంతో కాశీరాం ఇంటికి వెళ్లి సోదాలు చేయగా ఆయన ఇంట్లో 50 గ్రాముల గంజాయి లభించడంతో ముగ్గురిపైన కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా, మొత్తం 160 గ్రాముల గంజాయి లభించిందని, వాటి విలువ రూ.4 వేల వరకు ఉంటుందని అన్నారు.

'గంజాయి రవాణాదారుల అరెస్టు'

బోథ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసి విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వరరావు, బోథ్ ఎస్సై ప్రవీణ్ మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన సిరిసే వంశీ అనే వ్యక్తికి గంజాయి అమ్మినట్లు తేలడంతో ఇరువురు వ్యక్తులను బోథ్ బస్టాండ్ దగ్గర మంగళవారం పట్టుకోవడం జరిగిందని సీఐ తెలిపారు. బురికే నాందేవ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కెరీమెరీ మండలంలోని అంతాపూర్ గ్రామానికి చెందిన ఈయనతో పాటు ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం బూసిమెట్ట గ్రామానికి చెందిన గోధుమల మారుతి అనే ఇరువురికి గంజాయి విక్రయంతో సంబంధం ఉండడం వల్ల వీరిని అరెస్టు చేయడం జరిగిందని పోలీసులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆగని మొరం అక్రమ రవాణా!

● తాంసి తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచే రాకపోకలు ● పట్టించుకోని రెవెన్యూ శాఖాధికారులు

తాంసి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో మొరం అక్రమ రవాణా ఆగడం లేదు. అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యారు. రెవెన్యూ కార్యాలయం ముందే నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లల్లో మొరం తరలిస్తున్నా.. కనీసం పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో కాంట్రాక్టర్లదే ఇష్టరాజ్యంగా మారింది. గ్రామస్థులు తమకు ఇబ్బంది కలుగుతోందని, దుమ్ము తమ ఇళ్లల్లోకి వస్తుందని, పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ టిప్పర్ డ్రైవర్ల స్పీడుకు జనం బెంబెలెత్తుతున్నారు. ఒకవేళ మైనింగ్ పర్మిషన్ కనుక ఉన్నట్లయితే ఎన్ని ఫీట్ల లోతు తవ్వాలో కూడా తెలియదంటే అందులో అతిశయోక్తి లేదు. అంతేకాకుండా పెద్దపెద్ద బొందలు చేస్తున్నారని అంటున్నారు. మొరం కోసం మత్తడి వాగు ప్రాజెక్టులో జోరుగా తవ్వకాలు జరపడం గమనార్హం. దీంతో నిత్యం లక్షల రూపాయల్లో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని? ప్రశ్నిస్తున్నారు. మైనింగ్ పర్మిషన్ ఉందా? లేదా? కూడా సంబంధిత తహసీల్దార్‌కు తెలియదంటే పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం తమకు అనుమతి ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తు పెట్టుకున్నారు. దీంతో అధికారులు మాత్రం ఎక్కడెక్కడ మొరం తవ్వవచ్చు? ఏ టిప్పర్‌లో మొరం తరలించవచ్చు, వంటి తదితర విషయాలతో కూడిన లెటర్‌ను సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. అయితే ఇందులో మైనింగ్ పర్మిషన్ లెటర్ మాత్రం లేదని, ఉంటే చూపించవచ్చు కదా? అని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు మండల వాసులు కోరుతున్నారు.




తాంసి మండలం మత్తడి వాగు ప్రాజెక్టులో మొరం తవ్వుతున్న దృశ్యాలు

జొన్నలు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి

బోథ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వ రంగ సంస్థలకు అమ్ముకొని లాభం పొందాలని స్థానిక శాసన సభ్యుడు అనిల్ జాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ యార్డు ఆవరణలో జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకునే నష్టపోవద్దని కోరారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఛైర్మన్ కదం ప్రశాంత్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సీఈవో గోరి స్వామి, సహకార సంఘం డైరెక్టర్లు రాజు యాదవ్, పోశెట్టి, నారాయణ, శ్రీనివాస్, ఉమేష్, సహకార సంఘం డైరెక్టర్లు రవితేజ, ఏఎంసీ పీఏసీఎస్ పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. క్వింటాలుకు రూ.3371 చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

● రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

నేరడిగొండ: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు నిచ్చారు. మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించానన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయడం లేదన్నారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శివారెడ్డి, మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతం రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ తిరుమల్ గౌడ్, వీడీసీ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బోథ్‌లో జొన్న కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

కాగా, బీఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జై కేసీఆర్ జై కేటీఆర్ జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. కార్యకర్తలు జై అనిల్ అన్న అంటూ నినాదాలు చేస్తూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మత్తుతో చిత్తు

(5వ పేజీ తరువాయి...)

వ్యవసాయ పనులకు సైతం తీవ్ర ఆటంకంగా మారుతోంది. నిరక్షరాస్యులైన అమాయక గ్రామీణులకు తెలియకుండానే భయంకర వ్యాధులు చుట్టు ముట్టి ప్రాణాలను తోడేస్తున్నాయి. అసలు ఏది కల్తీనో? ఏది అసలో? తెలియక ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ప్రధానంగా క్యాన్సర్, క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల బారీన పడుతూ దీర్ఘకాలంగా మంచం పడుతూ మూలుగుతున్నారు. ఎన్నో కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోతూ రోడ్డున పడుతున్నాయి. తెలియకుండానే మద్యానికి బానిసవుతున్న ఎందరో మంది యువకులు అనారోగ్య బారీన పడి మంచం పడుతున్నారు.

మొదలైన టెండర్లు

గ్రామాభివృద్ధి పేరిట వీడీసీలు అనధికారికంగా బెల్ట్‌షాపులకు టెండర్లను నిర్వహిస్తున్నారు. ప్రతియేటా ఉగాది తర్వాత జిల్లాలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలకు టెండర్లను నిర్వహించడం పరిపాటిగా మారింది. ఇప్పటికే ఉగాది పండుగ ముగిసిపోవడంతో 80 శాతం గ్రామాల్లో బెల్ట్‌షాపులకు టెండర్లను పూర్తి చేసినట్లు తెలుస్తుంది. అయితే అక్రమ మద్యం అమ్మకాలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపించడంతో బెల్ట్‌షాపు నిర్వాహకులు కొంత సైలెంట్‌ై పోయినట్లు కనిపిస్తోంది. పరిస్థితులు చక్కబడిన తర్వాత మళ్లీ బెల్ట్‌షాపులను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్కో గ్రామంలో లక్ష నుంచి రూ.25 లక్షల వరకు టెండర్లను వేసి బెల్ట్‌షాపులను దక్కించుకుంటున్నారు. అనధికారికంగా టెండర్లను నిర్వహిస్తున్న వీడీసీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. మద్యం మత్తుకు ఎందరో మంది ప్రాణాలు బలవుతున్నా.. వీడీసీలకు పట్టింపే లేకుండా పోతోంది. బెల్ట్‌షాపులకు టెండర్లు నిర్వహిస్తూ చేతులు దులుపుకోవడంతో నిరుపేద కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి.

'ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు'

నార్నూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర చాలా ముఖ్యమైన అంశం అని సంత్ సేవ లాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ చవాన్ అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో పదవీ విరమణ పొందిన జాదవ్ పరుశురాం ఉపాధ్యాయుడికి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మేధాశక్తిని పెంచే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు పేర్కొన్నారు. ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ డీఈ, గణేష్ రాథోడ్, జాదవ్ ఆనంద్ రావు, మునిరాం చవాన్, హరిచంద్ చవాన్, తానాజి, రామరావు, ప్రకాష్ చవాన్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ రామయ్యకు ఘన నివాళి

ఉట్నూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శాలివాహన కుమ్మరుడైన పద్మశ్రీ దరిపెల్లి రామయ్యకు శాలివాహన సంఘం నాయకులు నివాళులర్పించారు. మండలంలోని లక్కారంలో మంగళవారం శాలివాహన సంఘం నాయకులు పద్మశ్రీ రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన సొంత ఖర్చులతో కోటి మొక్కలు నాటి వాటి ఎదుగుదల చూసుకున్న ఏకైక మానవుడైన దరిపెల్లి రామయ్యకి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు. అందుకే ఆయనను వనజీవి రామయ్య అని కూడా పిలుచుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మర ఉట్నూర్ మండల కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్, తొగరిరఘు, సబ్బుల రాజన్న, మల్లయ్య, రాజరామ్, రాజేశ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్ ఆద్మీ పార్టీలో చేరిన రిటైర్డ్ ఉద్యోగి

బోథ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన పోస్టల్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ ఉద్యోగి శంకర్ మంగళవారం అమ్‌ఆద్మీ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ హైదర్ పార్టీలో స్వాగతించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల వరకు పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఆయన వెంట పలు పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఉన్నారు.

కంపోస్ట్ ఎరువులపై అవగాహన కల్పించాలి

నర్సాపూర్(జి), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వర్మీ కంపోస్ట్ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో అజీజ్ ఖాన్ అన్నారు. మంగళవారం నర్సాపూర్(జి)లో ఆయన పర్యటించారు. ముందుగా సెగ్రిగేషన్ షెడ్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసే వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేయాలన్నారు. గతంలో పంచాయతీ సెక్రటరీగా పని చేసిన రోజులు గుర్తుకొస్తున్నాయని అధికారులు, గ్రామస్థులతో జ్ఞాపకాలు పంచుకున్నారు. వారితో పాటు ఎంపీవో తిరుపతి రెడ్డి, గ్రామ కార్యదర్శి కైలాస్ రాథోడ్ ఉన్నారు.

శతావధానములో కవి వెంకట్‌కు ప్రాశ్నిక సన్మానం

ముథోల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, డా. బి. వెంకట్ తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజాపద్యం, అవధాన విద్యా వికాస పరిషత్ సంయుక్త నిర్వహణలో తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన డా.మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానములో ప్రాశ్నిక సన్మానం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి యూ. దుర్గా ప్రసాదరావు, అధ్యక్షులు నారుమంచి వెంకట అనంతకృష్ణ, అవధాన విద్యా వికాస పరిషత్తు ప్రధాన కార్యదర్శి మరుమాముల దత్తాత్రేయశర్మ, దర్శనం మాస పత్రిక ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకట రమణశర్మ, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, సంచాలకులు ఆముదాల మురళి, శతావధాని పట్వర్ధన్ చేతుల మీదుగా శతావధానం పృచ్ఛక సన్మానమును ప్రముఖ పద్యకవి సంస్కృత భాషా ప్రచార సమితి, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు డా. బి. వెంకట్ అందుకున్నారు. ఈ నెల 12వ తేదీ నుండి ఈ రోజు వరకు హైదరాబాద్‌లో జరిగిన డా. మారేపల్లి వెంకట రమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానంలో వెంకట్ పాల్గొని వర్ణన అనే అంశంలో సర్వం శివమయం జగత్, రామాయణం రసామృత కావ్యం, పురాణ శ్రేష్ఠం శ్రీమద్భాగవతం అంశములను జోడిస్తూ గత నెలలో జరిగిన ప్రయాగ్ రాజ్ కుంభమేళా ఇతి హాసమును తీసుకొని నైమి శారణ్యములో కోట్ల కొలది భక్తులు సంచరిస్తుంటే నైమిషారణ్యము ఏ విధంగా ఆనందపడినదో ఆ దృశ్యమును సుందరముగా వర్ణించుకుమని అవధానిని అడుగగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెన్నూరుకు చెందిన శతావధాని పట్వర్ధన్ అవలీలగా పద్యరూపములో వర్ణించారని వెంకట్ చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి వంద మంది ప్రాశ్నకులు పాల్గొనగా నిర్మల్ నుండి వెంకట్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో

బాధిత కుటుంబాలకు బాసట

భైంసా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు నిర్వహించుకున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించి బాసటగా నిలుస్తున్నామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలవాసులు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు తొలగించి తోడ్పాటునిచ్చేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో సహాయకారిగా నిలుస్తోందన్నారు. నియోజక వర్గ పరిధిలోని బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం కోసం గాను భైంసాలోని తమ క్యాంపు కార్యాలయంలో చికిత్సకు సంబంధించి వివరాలు,బిల్స్ తీసుకవచ్చి సంప్రదించాలని సూచించారు. ఇందులో నియోజక వర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, లోకేశ్వరం మండల ప్రతినిధి ఎస్. సుధీర్ రెడ్డి, బాసర మండల ప్రతినిధులు మామ్మాయి రమేష్, జంగం రమేష్, కుబీర్ మండల ప్రతినిధి రవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ పేరిట అధికారిక భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు

● భైంసా ఆర్‌డీవో కార్యాలయంలో మున్సిపల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్ ఫిర్యాదు
● మున్సిపల్ కమిషనర్, సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలకు డిమాండ్


భైంసా, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో ఎల్‌అర్ఎస్ పేరిట పలు అధికారిక భూముల అక్రమ రిజిష్ట్రేషన్లు జరుగుతున్నాయని మున్సిపల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్ ఆరోపించారు. మంగళవారం సంబంధిత విషయంలో అర్‌డీవో కార్యాలయంలో పలు ఆధారాలతో కూడిన పత్రాలతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అర్‌డీవో కార్యాలయం ఎదుట మున్సిపల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్ విలేకరులతో మాట్లాడారు. పట్టణ పరిధిలోని పలు సర్వే నెంబర్లలోని ప్రభుత్వ, ఎండోమెంట్, వక్ఫ్ భూములను ఎల్‌అర్ఎస్ పథకాన్ని అసరగా తీసుకొని కొంత మంది బడా బాబులు అక్రమంగా రిజిష్ట్రేషన్ చేసుకుంటున్నారని వెల్లడించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్, సబ్ రిజిష్ట్రార్ తోడ్పాటునిస్తున్నారని ఆరోపించారు.రిజిష్ట్రేషన్ అండ్ స్టాంప్స్ , రెవెన్యూ శాఖలు సంబంధిత సర్వే నెంబర్లలోని భూములు ప్రభుత్వ, ఎండోమెంట్, వక్ఫ్ భూములను పేర్కొంటున్నప్పటికి ఇద్దరు అధికారులు వాటిని బేఖాతరు చేస్తూ అక్రమ రిజిష్ట్రేషన్లకు మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. సంబంధిత ప్రక్రియపై పూర్తి స్థాయి ఆధారాలతో అర్‌డీవో కార్యాలయంలో ప్రత్యక్షంగా ఫిర్యాదు చేసినట్లుగా వెల్లడించారు. జిల్లా కలెక్టర్, అధనపు కలెక్టర్ , జిల్లా రిజిష్ట్రార్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులకు పోస్టు ద్వారా సంబంధిత విషయంలో ఫిర్యాదు చేసినట్లుగా వివరించారు. ఉన్నతాధికార యంత్రాంగం సంబంధిత విషయంలో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో అక్రమంగా జరిగిన రిజిష్ట్రేషన్లను తక్షణమే రద్దు చేయాలని, ఇందుకు తోడ్పాటునిచ్చిన మున్సిపల్ కమిషనర్, సబ్ రిజిష్ట్రార్‌లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. సంబంధిత విషయంలో భైంసా సబ్ రిజిష్ట్రార్ శ్రీలతను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఎల్‌ఆర్ఎస్ పథకం ద్వారా తాము ఎలాంటి అక్రమ రిజిష్ట్రేషన్లు చేపట్టలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ఎండోమెంట్, వక్ఫ్ భూముల జాబితా తమ వద్ద ఉందని అలాంటి భూములను ఎలాంటి పరిస్థితుల్లోనూ రిజిష్ట్రేషన్ చేయబోమని వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్‌ను వివరణ కోరగా రిజిష్ట్రేషన్లకు సంబంధించి మున్సిపల్ శాఖకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అధికారులు ఎవరైనా ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగానే నడుచుకుంటారని, విరుద్ధంగా వ్యవహరించరని పేర్కొన్నారు.



ఆర్‌డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందచేస్తున్న బీజేపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్

వారం రోజుల్లో గ్రామాల్లో రోడ్ల పనులు ప్రారంభం కావాలి

● తాగునీటి సమస్యను వెనువెంటనే పరిష్కరించాలి
● రెవెన్యూ, ఉపాధి హామీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



దగ్ధమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

ముథోల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రావద్దని, ఈ విషయంలో అధికారులు సీరియస్‌గా దృష్టి సారించి ప్రజలకు నీటిని అందించాల్సిన బాధ్యత ఉందని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం ముథోల్ నియోజకవర్గం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లోకి వెళ్తే ఎక్కడైనా తాగునీటి సమస్య గురించి ప్రజలు ఎక్కువగా చెబుతున్నారన్నారు. రోజుల తరబడి సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన మిషన్ భగీరథ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని వీటివల్లన ప్రజానీకానికి సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని లేని పక్షంలో బోరు బావులు వేసి తాగునీటిని ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటి వరకు పలు గ్రామాల్లో ఎంపీ లాండ్స్ నిధులతో బోరు బావులు వేయించడం, మోటార్లు ఇవ్వడం జరిగిందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే నేరుగా సెక్రటేరియట్‌కు ఫోన్ చేస్తానని లేనిపక్షంలో ముఖ్యమంత్రిని కలిసి సమస్యను విన్నవిస్తానన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలకు వెళ్లే రోడ్డు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ పథకం కింద తక్షణమే రోడ్ల పనులు ప్రారంభించాలన్నారు. కోట్లాది రూపాయల నిధులు ఉపాధి హామీలో వస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్య వైఖరి మూలంగా పనులు జరగడం లేదన్నారు. అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లాలని, రోడ్ల పనులకు ఎవరైనా అడ్డుపడితే తక్షణమే రెవెన్యూ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి జిల్లా అధికారులతో పాటు ఆర్‌డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, టీఏలు, ఐకేపీ అధికారులు రావడంతో క్యాంపు కార్యాలయం అధికార గణంతో కళకళలాడింది. కార్యక్రమంలో ఆర్‌డీవో కోమల్ రెడ్డి, డీపీవో శ్రీనివాస్, ఈఈలు సందీప్, రాఘవేంద్ర రాజు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదంతో

మొక్కజొన్న పంట దగ్ధం .. పరిశీలించిన ఎమ్మెల్యే

భైంసా రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాగాం గ్రామంలో కారాగారి సాయినాథ్, పూదరి చిన్ను అనే రైతులకు చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న పంట విద్యుత్ తీగల వల్ల అగ్నికి ఆహుతి అయ్యింది. దీంతో బాధిత రైతులకు చెరో లక్ష రూపాయల వరకు నష్టం జరిగింది. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మహాగాం గ్రామానికి చేరుకుని పంట నష్టాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతుకు ప్రభుత్వం ద్వారా ఆదుకునేందుకు చరయలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్‌లు అప్పాల రాకేష్, చిన్నన్న, నాయకులు భీమినేని శంకర్, తదితరులు ఉన్నారు.



నిరసనలో పాల్గొన్న మహిళలు

అందాల పోటీలు రద్దు చేయాలి : పీవోడబ్ల్యూ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో మే నెల 7 నుంచి నిర్వహించే అందాల పోటీలను రద్దు చేయాలని పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు కే.లక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల జేఏసీ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ... అందాల పోటీల పేరుతో ఆడపిల్లలను వ్యాపార వస్తువుగా మార్చి కార్పొరేట్ కంపెనీలు తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలతో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం మహిళా లోకాన్ని అగౌరవ పరచడమేనన్నారు. అందాల పోటీల నిర్వహణతో తెలంగాణకు బ్రాండ్ ఇమేజ్ రాదన్నారు. నంది, ఎస్. లక్ష్మీయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భాగ్యనగర్ గ్రామంలో మంగళవారం బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన చేసినట్లు మండల మాజీ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ... గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం తన సొంత ఖర్చులు రూ. 2.61 లక్షలతో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. మంగళహారతులతో మహిళలు రామేశ్వర్‌రెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ... రామేశ్వర్‌రెడ్డి లాంటి యువ నాయకులు ప్రజలకు అవసరం అన్నారు. వారు మాట ఇస్తే తప్పకుండా ఆ మాట నిలబెట్టుకుంటారన్నారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎంపీపీకి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాండ్లవిలాస్, సర్పంచ్‌లు సాయన్న, రాము, భూమేష్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ విజయశేఖర్, డైరెక్టర్ శేఖర్, కౌన్సిలర్ శ్రీకాంత్, నాయకులు, సంఘం నాయకులు, టీచర్ రాజేశ్వర్, వెంకట స్వామి, కొరిపెల్లి శ్రీనివాస్, రాములు, లక్ష్మణ్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరకోట దేవస్థానం ఛైర్మన్‌కు పరామర్శ

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానం ఛైర్మన్ కొండా శ్రీనివాస్ తండ్రి ఆర్మూర్ మండలం దేగామ గ్రామంలో ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను నిర్మల్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, నిర్మల్ మాజీ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి, పూదరి అరవింద్, గండిరామన్న ఆలయ ఛైర్మన్ భూరాజ్, గాండ్లవిలాస్, దేవరకోట ఆలయ డైరెక్టర్లు నరేందర్, ఆరే చిరంజీవి, మీరా రాజేశ్వర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కడెం మండల

కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలుగా నుస్రత్ ఫాతిమా

కడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కడెంకు చెందిన నుస్రత్ ఫాతిమాను మహిళా కాంగ్రెస్ కడెం మండల ఉపాధ్యక్షురాలుగా నియామకం చేసినట్లు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్. భవాని తెలిపారు. ఈ మేరకు మంగళవారం నుస్రత్ ఫాతిమాకు నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సిహెచ్. భవాని నియామక పత్రాన్ని అందజేశారు. తమకు మండల ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు నుస్రత్ ఫాతిమా జిల్లా అధ్యక్షురాలు సిహెచ్. భవానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ భద్రత కరువు..

బతుకు బరువు!

● ఇబ్బందుల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉట్నూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేక బతుకు భారమవుతోందని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో గ్రామీణ కూలీలు పనుల కోసం వలసలు వెళ్లకుండా గ్రామీణస్థాయిలోనే పనులు కల్పించాలని పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ప్రతీ కూలికి 100 రోజుల పని కల్పించాలని భావించారు. రాష్ట్రవ్యాప్తంగా 53 లక్షల జాబ్ కార్డులు ఉండగా, సుమారు కోటి 10 లక్షలకు పైగా కూలీలకు ఈ చట్టం ద్వారా ప్రయోజనం కలుగుతుందని తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో 1,80,000 జాబ్‌కార్డులు ఉండగా, రెండు లక్షల మందికి పైగా కూలీలు పనులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ కూలీల ద్వారా పనులు చేయించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. ఇందులో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ సామాజిక వర్గాలకు చెందిన వారితోపాటు మహిళలు, దివ్యాంగులు కూడా ఉన్నారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను గత ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. అదే తరహాలో తమకు కూడా క్రమబద్ధీకరించాలని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్మెకు కూడా పూనుకున్నారు. అయినా గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పట్టించుకోలేదు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నప్పటికీ ఉపాధిహామీ కూలీల సమస్యలను పట్టించుకోవడంలో ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు భావిస్తున్నారు.



ఉపాధి పనులు పర్యవేక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

● విధులు సరే.. వేతనాలు ఏవీ!?

గ్రామీణ ప్రాంతాల కూలీలకు పని దినాలతో ఉపాధి కల్పిస్తూ పనులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత నాలుగు నెలలుగా వేతనాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. చాలీచాలని వేతనాలు, ఉద్యోగ భద్రత లేక బాధ్యతలు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరుతున్నారు. పనిచేస్తున్న ప్రదేశం నుంచి ఉపాధి కూలీల ఫొటోలను యాప్‌ల ద్వారా ఉదయం సాయంత్రం నమోదు చేస్తున్నారు. గ్రామాల్లోని నర్సరీలలో ఏడు రకాల రిజిస్టర్లను నమోదు చేయాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీల సెక్రటరీలకు సహాయంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ఆత్మీయ భరోసా లాంటి పథకాల్లో పనిచేస్తున్నారు. ఇన్ని పనులు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను మూడు కేటగిరీలుగా విభజించి వేతనాలు అందిస్తున్నారు. కర్ణాటక, కేరళ రాష్టాలలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు అక్కడి ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించాయి. ఏపీ ప్రభుత్వం సైతం ఫీల్డ్‌అసిస్టెంట్ల కష్టలు గుర్తించి నెలకు రూ.18వేల వేతనం అందిస్తోంది. 18 ఏళ్లుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకువస్తున్నారు. ఇప్పటికైనా ఉద్యోగ భద్రతతోపాటు సకాలంలో వేతనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్ కోరుతున్నారు.

పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నాం..

● మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్



మాకు సకాలంలో వేతనాలు రావడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఇల్లు గడవడం కష్టం అవుతున్నది. మా పిల్లలకు పాఠశాల ఫీజులు చెల్లించలేదని పరీక్షలకు హాజరు కానివ్వడం లేదు. ఫలితంగా నా కొడుకు విద్యా సంవత్సరం నష్టపోయాడు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.



మండలకేంద్రంలో వెలిసిన జ్యూస్ సెంటర్



బండిపై జ్యూస్ విక్రయిస్తున్న దృశ్యం

వేసవి తాపాన్ని తీర్చేందుకు

జ్యూస్ సెంటర్లు రెడీ!

● రోడ్లపై వెలిసిన పండ్ల రసాల దుకాణాలు

ఇచ్చోడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపాన్ని తీర్చేందుకు మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద జ్యూస్ సెంటర్లు వెలిశాయి. ఆరోగ్యానికి వ్యాయామం ఎంత ముఖ్యమో తగిన పోషకాలూ అంతే ముఖ్యం. దీనికోసం పళ్లరసాలు, రాగిజావా, పాలు తీసుకుంటున్నారు పట్టణ వాసులు. వారి అవసరాలు గుర్తించి ప్రత్యేకంగా ఇలాంటి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్లో గుమ్మడి, సోర, బీట్‌రుట్ వంటి దుంపలు మార్కెట్లో ఎక్కువగా లభిస్తున్నాయి. వీటిని జూస్ సెంటర్ల నిర్వాహకులే టోకుగా కొనుగోలు చేసి తెచ్చుకంటున్నారు. ఇచ్చోడ మార్కెట్‌లో నిశివాజీ చౌక్, అంబేడ్కర్ చౌక్, కొమురంభీం చౌక్, సిరిచెల్మ, సిరికొండ చౌరస్తాలల్లో బీజీ మార్కెట్ పరిసరాల్లో దుకాణాలు వెలిశాయి.

సూచనలు, సలహాలతోనే..

జూస్ సెంటర్ల నిర్వాహకులు కొత్త రకాలను తయారుచేసే ముందు ఆరోగ్య నిపుణులు, న్యూట్రీషన్ల సూచనలు తీసుకుంటున్నారు. పైనాపిల్, సపోట, తర్బుజ, అంగూర్, ఆపిల్ జూస్‌లో నిమ్మ, అల్లం, వెల్లుల్లి చేరుస్తున్నారు. ఇందులో వందకు ఒకరిద్దరు మాత్రమే చక్కెర, ఉప్పు కలపమని అడిగే వారుంటున్నారు. దీంతో చాలావరకు ఐస్ చక్కెర, ఉప్పుతో పనే ఉండడంలేదు.

రసాలతోపాటు పండ్లూ సిద్ధం

పండ్ల రసాలు తాగని వారి కోసం అక్కడే పండ్లు సైతం సిద్ధంగా ఉంటున్నాయి. దోసకాయ, ఖర్జురం, జామ, పుచ్చకాయలు తోపుడు బండ్లపై నిత్యం విక్రయించేందుకు సిద్ధగా ఉంచుతున్నారు. ఉదయం నడక వ్యాయామాలు, ఆటల కోసం వచ్చినవారు ఈ పండ్లను తీసుకుని వేళ్తున్నారు. కాస్త సమయం ఉంటే అక్కడే తినేస్తున్నారు. ఇవి లభిస్తాయని తెలిసిన వాహనదారులు తీసుకొని తమ ప్రయాణాల్లో ఆరగిస్తున్నారు. గిరాకీ బాగానే ఉందని, ఒక్కోసారి ఇంత శ్రమించి విక్రయాలు లేక ఇంటికి తీసుకెళ్లాల్సి వస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.



కుభీర్‌లోని భట్టిగల్లీలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

మూగజీవాల దాహార్తి తీరేదెలా?

కుభీర్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భట్టిగల్లీ హనుమాన్ ఆలయ సమీపంలో మూగ జీవాల దాహర్తి తీర్చడం కోసం నిర్మించిన నీటి తొట్టి ఇంది. గతంలో ఈ నీటి తొట్టిలో నీరు నింపితే పశువులు దాహర్తి తర్చుకునేవి. పాలనా యంత్రాంగం నిర్లక్ష్యంతో తొట్టి నిరుపయోగంగా మారగా పశువుల నీటి కోసం తల్లడిల్లుతున్నాయి. ఇదే పరిస్థితి మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొందని వేసవి దృష్ట్యా నీటి తొట్టిలను వినియోగంలోకి తీసుకు రావాలని రైతులు మండల వాసులు కోరుతున్నారు.

కలగానే కల్లాల నిర్మాణాలు

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం
● మూడేళ్లుగా నిలిచిపోయిన పథకం
● ఇబ్బందులు పడుతున్న రైతులు

కుభీర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓవైపు యాసంగి పంట కోతలు మొదలయ్యాయి. మరోవైపు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులను కొనుగోలు చేసేందుకు కేంద్రాల ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోతల అనంతరం పంట దిగుబడులను ఆరబోసుకోవడానికి అనుకూలంగా కల్లాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో రైతుల అవసరం మేరకు కల్లాలు లేవు. దీంతో వారు రహదారులు, కల్వర్టుల మైదానం వంటి ప్రదేశాల్లో పంట దిగుబడులను ఆరబోస్తున్నారు. కోతలు ముమ్మరమైతే అనేక ప్రాంతాల్లో రహదారులే కల్లాలలుగా మారే అవకాశం ఉంది. దీంతో రాత్రి వాహనదారులు, ప్రమాదాలకు గురయ్యే అవకాశ ఉంది.

సమన్వయ లోపం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేని కారణంగా గత మూడేళ్లుగా కల్లాల పథకం నిలిచిపోవడంతో అర్హులైన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు అన్నదాతల కష్టాలను గుర్తించి పథకాన్ని పునరుద్ధరిస్తే మేలు జరిగే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

మండలానికి 272 కల్లాల మంజూరు

మూడేళ్ల క్రితం మండలానికి 272 కల్లాలు మంజూరయ్యాయి. అందులో 154 మాత్రమే పూర్తయ్యాయి. మిగతా 68 వివిధ దశల్లో ఉన్నాయి. ఇందుకు గాను ఒక్కో కల్లానికి రూ.85,403 రైతుకు చెల్లించారు. మొత్తం మండల రైతులకు రూ.కోటీ 32 లక్షల వరకు చెల్లించారు. పథకం నిలిచిపోవడంతో ప్రతీ సీజన్‌లో వ్యవసాయ దిగుబడుల ఆరబోతకు రైతులకు కష్టాలు తప్పడం లేదు. పంట కోతలకు ముందే రహదారులు పక్క ఖాళీ సంచులు వేసి ఆ స్థలం తమదే అనిపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఏపీవో హరిలాల్‌ను మాట్లాడగా ఈ పథకం గత మూడేళ్లుగా నిలిచిపోయిందని, ప్రభుత్వం పునరుద్ధరిస్తే ఆ ప్రకారమే ముందుకెళ్లి మండలంలో అర్హులైన రైతులందరికీ కల్లాలను మంజూరు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి పాటు పడతామని చెప్తున్నారు.



రైతు నిర్మించుకున్న కల్లం



కల్లం నిర్మాణం కోసం రైతు ఏర్పాటు చేసిన స్థలం

నిర్మాణాలు ఇలా..

కల్లాల చుట్టూ ఒక అడుగు లోతు 1.6 అడుగుల వెండల్పుతో పునాది తవ్వాలి. 40 ఎం ఎం కంకరతో నాలుగు ఇంచుల మందంతో సీసీ బెడ్‌వేయాలి. 20ఎంఎం, 40ఎంఎం కంకర సిమెంట్‌తో కలిపి రిటైనింగ్ వాల్(2.2 అడుగుల ఎత్తు) నిర్మించాలి. లోపలి భాగంలో ఒక అడగు మందం గ్రావెల్ పోయాలి. 40ఎంఎం కంకరతో ఒక అడుగు సీసీ బెడ్ వేయాలి. 20 ఎంఎం కంకరతో రెండు ఇంచుల మందం సీసీ వేయాలి. నాలుగు మూలలకు రెండు అడుగుల దూరం వరకు 8ఎంఎం మ్యాట్ అమర్చాల్సి ఉంటుందని ఉపాధి హామి ఏపీవో హరిలాల్ తెలిపారు.



రోడ్లపై దుమ్మూదూళి లేస్తున్న దృశ్యం

దుమ్ము లేస్తోంది..

ఎవరికీ పట్టదేంది?

వర్షాకాలంలో రాకపోకలు సాగించడానికి ప్రతిబంధకంగా మారుతున్న వాగులపై ప్రభుత్వం వంతెనల నిర్మాణం చేపట్టి ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేస్తోంది. అయితే ఆ పనులు నత్తనడకన సాగడంతో ఆ ప్రాంతాల్లో దుమ్మూ దూళి లేచి వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బజార్‌హత్నూర్ మండలం కొల్హారి, ఇచ్చోడ మండలం ఆడే గామ వద్ద ఈ పరిస్థితులు నెలకొన్నాయి. దుమ్మూ దూళి లేవడం కారణంగా అనారోగ్యాల భారీన పడుతున్నామని ఇక్కడి నుంచి నిత్యం రాకపోకలు సాగించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టి సారించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



వంతెన పైనుంచి వెళ్తున్న వాహనాలు

నిర్లక్ష్యంగా రోడ్డు విస్తరణ పనులు!

● రోడ్డుకు ఆనుకునే విద్యుత్ స్తంభాలు ● పర్యవేక్షించని అధికారులు ● ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని మండిపడుతున్న గ్రామస్థులు, ప్రయాణికులు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుండంపల్లి రోడ్డు విస్తరణ పనులు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే పనులు చేపడుతున్నారు. గతంలో ఇరుకుగా ఉన్న రోడ్డును విస్తరించేందుకు ప్రభుత్వం రూ. 10 కోట్లను మంజూరు చేసింది. 2024 జూలైలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ చేశారు. రూ.10కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ శాఖ రెండు వరుసల రహదారి నిర్మిస్తోంది. ఈ మేరకు ఆ శాఖ పనులను కాంట్రాక్టర్‌కు అప్పజెప్పింది. అయితే గతంలో ఇరుకుగా ఉన్న రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే ఆర్‌అండ్‌బీ శాఖ రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండటంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేపు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు.

డబ్బులు చెల్లిస్తేనే స్తంభాల తొలగింపు..

రోడ్డు విస్తరణ పనుల విషయంలో విద్యుత్ స్తంభాలు తొగించకపోవడానికి విద్యుత్, రోడ్లు భవనాల శాఖ మధ్య సమన్వయ లోపమే కారణమా అన్న సందేహం వ్యక్తమవుతోంది. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలంటే విద్యుత్ శాఖకు ఆ శాఖ అధికారులు వేసిన అంచనా ప్రకారం సంబంధిత గుత్తేదారు డీడీ రూపంలో గాని చలాన్ రూపంలో గాని డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే విద్యుత్ శాఖ అధికారులు వేసిన ఎస్టిమేట్ ప్రకారం సుమారు రూ.20 లక్షల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆ మొత్తం చెల్లించాకే విద్యుత్ స్తంభాలు తొలగిస్తామని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే అంతమొత్తం చెల్లించేందుకు సంబంధిత గుత్తేదారు నిరాకరిస్తున్నట్లు తెలిసింది. దీంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు ఈ మొత్తం ప్రభుత్వమే చెల్లించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాక విద్యుత్ శాఖకు చెల్లిస్తామని చెప్పారు.



కంకర వేసి రోలర్‌తో తొక్కిస్తున్న దృశ్యం

శరవేగంగా విస్తరణ పనులు..

ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైన గుండంపల్లి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి గుండంపల్లి వరకు కంకర వేసే పని పూర్తయింది. దాదాపు కిలో మీటర్ వరకు బీటీ కూడా వేశారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే స్తంభాలు తొలగించాకే విస్తరణ పనులు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు..

గుండంపల్లి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు 2026 ఫిబ్రవరి వరకు గడువు ఉందని ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈ ఆంజనేశ్వర్ తెలిపారు. విద్యుత్ స్తంభాలు తొలగించేందుకు విద్యుత్ శాఖ అధికారులు రూ. 20 లక్షల అంచనాలు రూపొందించి ఇచ్చారని, అంత మొత్తం చెల్లించేందుకు కాంట్రాక్టర్ నిరాకరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. నిధులు మంజూరయ్యాక విద్యుత్ శాఖకు చెల్లిస్తామని ఆయన తెలిపారు.

డబ్బులు చెల్లిస్తేనే స్తంభాలు తొలగిస్తాం..

● శంకర్, ఏఈ, విద్యుత్ శాఖ

గుండంపల్లి రోడ్డు విస్తరణ పనులకు ఆటంకంగా విద్యుత్ స్తంభాలు ఉంటే వాటిని తొలగించాల్సి వస్తే ఎస్టిమేషన్ ప్రకారం విద్యుత్ శాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. డబ్బులు చెల్లిస్తేనే రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగిస్తాం. దీనికి సంబంధించిన ఎస్టిమేషన్‌పే 2నెలల క్రితమే ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు ఇచ్చాం.



రోడ్డుకు ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు



గుండంపల్లిలో విద్యుత్ స్తంభాలను తొలగించకుడానే వేసిన రోడ్డు ఇలా..





మత్తుతో.. చిత్తు

- గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు
- కల్తీ మద్యంతో చుట్టు ముడుతున్న భయంకర వ్యాధులు
- టెండర్లను నిర్వహించేందుకు సిద్ధమవుతున్న గ్రామ వీడీసీలు
- బెల్ట్ షాపు యజమానులకు జిల్లా ఎస్పీ సీరియస్ వార్నింగ్



ఇటీవల పోలీసుల దాడిలో పట్టుబడిన అక్రమ మద్యం



ఆదిలాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం ఏరులై పారుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు బడా లిక్కర్ వ్యాపారులు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తూ దందాను కొనసాగిస్తున్నారు. ప్రతీ ఊరిలో గల్లీ గల్లీకి బెల్ట్‌షాపులను ఏర్పాటు చేయడంతో మందుబాబులు మద్యం మత్తులో పడి చిత్తవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ అక్రమ వ్యాపారానికి అడ్డు రాకుండా గ్రామ వీడీసీలను డబ్బు, రాజకీయ పరపతితో తమ వైపునకు తిప్పుకుంటున్నారు. అమాయక పల్లె జనానికి డబ్బు ఆశ చూపుతూ అక్రమ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు. ఇదే అదునుగా కొన్ని గ్రామాల్లో కల్తీ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తుంది. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలతో గ్రామాల్లో అశాంతి వాతావరణం నెలకొంటోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గత కొద్ది రోజులుగా అక్రమ మద్యం అమ్మకాలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపించడంతో ఇప్పుడిప్పుడే అక్రమ మద్యం వ్యాపారానికి అడ్డుకట్ట పడుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా మండల స్థాయి అధికారులు బెల్ట్‌షాపులపై దాడులు చేయడం కనిపిస్తోంది. ఇన్నాళ్లు అక్రమ దందాలతో పాలు పంచుకున్న అధికారులు.. ఇప్పుడు పూర్తిగా సైలెంటై పోతున్నారన్న విమర్శలు లేకపోలేదు. పూర్తిస్థాయిలో బెల్ట్‌షాపులను ఎత్తివేస్తేనే గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనే అవకాశం ఉందంటున్నారు.



ఇటీవల భీంపూర్ మండలంలో దేశీదారు మద్యాన్ని పట్టుకున్న పోలీసులు(ఫైల్)



జైనథ్ మండలంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్న పోలీసులు

సరిహద్దుపై ప్రత్యేక నిఘా

సరిహద్దు గ్రామాల్లో బెల్ట్‌షాపు దందా హద్దులు మీరుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. నకిలీ మద్యంతో పాటు సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర నుంచి కొందరు వ్యాపారులు భారీగా దేశీదారు మద్యాన్ని దిగుమతి చేసుకుంటూ విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారుల దాడుల్లో భారీగా దేశీదారు మద్యం పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎక్సైజ్ శాఖతో పాటు జిల్లా పోలీసులు సరిహద్దు ప్రాంతంపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా కట్టడి చర్యలను చేపడుతున్నారు. అయినా గుట్టుచప్పుడుకాకుండా రాత్రికి రాత్రే జిల్లాలోకి దేశీదారు మద్యాన్ని భారీగా తరలిస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందంటున్నారు. అంతేకాకుఆండా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం దేశీదారు మద్యాన్ని కట్టడి చేసేందుకు చర్యలు చేపడుతున్నా.. అక్రమ మద్యం అమ్మకాలకు అండదండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా బోథ్, బజార్‌హత్నూర్, తలమడుగు, తాంసి, బేల, జైనథ్ మండలాల్లో అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తుంది.

పెరిగిపోతున్న బాధితులు

గ్రామాల్లో మద్యానికి బానిసవుతున్న బాధితుల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. స్థానికంగా తక్కువ ధరకు దొరికే మద్యానికి అలవాటు పడడంతో భయంకర వ్యాధులు చుట్టు ముడుతున్నాయి. అలాగే వేలా పాలలు పాటించక పోవడంతో ఉదయం 7గంటల నుంచే మద్యం అమ్మకాలు ప్రారంభమవుతున్నాయి. రాత్రి 11 గంటల వరకు బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నా.. అడిగే వారే కరువవుతున్నారు. దీంతో గ్రామాల్లో

(తరువాయి 6వ పేజీలో...)



పీవోకు ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం

నార్నూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని గాదిగూడ మండలంలో గల బోజ్జుగూడ, రుప్పాపూర్, మొకసిగూడ, పర్స్వాడ(బీ), తదితర గ్రామాలలో ఎండాకాలం ప్రారంభం కన్న ముందు నుంచే తీవ్రమైన నీటి సమస్య నెలకొందని, తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఉట్నూర్‌లోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో పీవో ఖుష్బుగుప్తాకు ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఈ విషయమై వారు మాట్లాడుతూ మండె ఎండల వల్ల గ్రామాల్లోని చేతి పంపులలో కూడా నీరు రావడం లేదని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీవోకు తెలిపామన్నారు. వాస్తవానికి ఇక్కడి గ్రామస్థులు కనీసం తాగడానికి నీళ్లు లేక 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంటచేనుల వద్ద ఉన్న బావులలో నుంచి ఎడ్ల బండిపై డ్రమ్‌లలో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అంతేకాకుండా మహిళలు రాత్రీపగలు అనే తేడా లేకుండా వ్యవసాయ క్షేత్రాల వద్దకు కాలినడక వెళ్తున్నారు. నెత్తిపై నీటి బిందెలు మోస్తూ అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు తాగడానికి బాగా లేవని, మొత్తానికి కలుషితంగా ఉన్నాయని, అవి కూడా సరిగా రావడం లేదని ఐటీడీఏ పీవోకు విన్నవించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఏజెన్సీలోని ఆదివాసీ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, బోర్లు మంజూరు చేయాలని కోరామని తెలిపారు. దీనికి పీవో స్పందించిన పీవో త్వరలోనే నీటి సమస్యను పరిష్కారం చేస్తామని పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుష్, జిల్లా కార్యదర్శి కొట్నాక్ సక్కు, గ్రామస్థులు పంద్ర నగేష్, లచ్చు, కొత్నాక్ లింగు, నగేష్, కుమ్ర విలాస్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్య సంరక్షణకు తగు జాగ్రత్తలు పాటించాలి : కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాలికలు ఋతుక్రమానికి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్య సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. పింకిష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని బాలికలకు ఫౌండేషన్ ద్వారా సానిటరీ ప్యాడ్లను అందజేశారు. ఋతుక్రమంపై ఎటువంటి అపోహలు, భయాందోళనలు పెట్టుకోవద్దని సూచించారు. రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో మిల్కా, డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాట్నాపూర్ సమీపంలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతి

బోథ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ గ్రామం సమీపంలో రెండు కోట్ల 90 లక్షల 18 వేల రూపాయలతో నూతనంగా సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. మంగళవారం ఎందుకు సంబంధించిన వివరాలను ఫోన్‌లో వెల్లడించారు .గత ఏడాది అక్టోబర్ 7న ఎంపీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డికి సబ్ స్టేషన్ మంజూరు కోసం లేఖ రాయడం జరిగిందన్నారు. దీంతో ఎంపీటీసీఎల్ అధికారులు సబ్ స్టేషన్ మంజూరు కోసం కృషి చేశారని పేర్కొన్నారు. సబ్ స్టేషన్ మంజూరు కావడం వల్ల మండలంలోని పాట్నాపూర్ నిధిని కంటేగాం, బాబేర, ఇన్కుర్పల్లి, కరత్వాడ, నక్కల వాడ, లక్ష్మీపూర్, వేములపల్లి, కొత్తపల్లి, గురుదేవ్ నగర్, చింతగూడ, బాబరతాండ గ్రామాలకు లో వోల్టేజ్ సమస్య తీరిపోతుందని ఎంపీ పేర్కొన్నారు. తన ప్రతిపాదనతో విద్యుత్ శాఖ అధికారులు సబ్ స్టేషన్ మంజూరు చేయడం పట్ల ఆయా గ్రామాల ప్రజల తరపున అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఉట్నూర్ సీడీపీవో మాస ఉమాదేవి అన్నారు. మండలంలోని గట్టేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషన్ పక్షం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాస ఉమాదేవి మాట్లాడుతూ కిశోర బాలికలు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పోషకాహారం కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ కాంబ్లే పురుషోత్తం, అంగన్‌వాడీ టీచర్లు లలిత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉట్నూర్ సీడీపీవో మాస ఉమాదేవి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ బిల్లును ఆమోదించాలి : జాజుల

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేం ద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర నరేంద్ర మోదీ బీసీ అయితే 42 శాతం బిల్లును ఆమోదించాలని కోరారు. బీసీ బిల్లును ఆమోదించని పక్షంలో గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. త్వరలో 10 లక్షల మందితో పరేడ్ మైదానంలో బీసీ గర్జన నిర్వహిస్తామన్నారు.

18న విద్యార్థులకు సెమినార్

ఉట్నూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న ఉట్నూరు పట్టణంలోని హెచ్‌కేజీఎన్ కన్వెన్షన్ హాల్లో సన్‌రైస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ సెమినార్ సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల ప్రతినిధులు గోపాల్ నాయక్, తల్లైవా బానోత్ రాజ్‌కుమార్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలో సన్‌రైజ్ ఎడ్యుకేషనల్ హబ్ ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడంతో పాటు గిరిజన ప్రాంతాల విద్యార్థులకు సామాజిక సేవలో భాగంగా పదవ తరగతి అనంతరం విద్యార్థులు మంచి కోర్సులలో ప్రవేశం పొందడానికి క్యారియర్స్ గైడెన్స్ సెమినార్ దోహద పడుతుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై తమ పిల్లలు భవిష్యత్తు కోసం మంచి నిర్ణయాలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

.. పలు అంశాలపై అవగాహన

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం కేరియర్ గైడెన్స్, జెండర్ అండర్ ఈక్వటి అంశాలపై అవగాహన కల్పించారు. పీఎంశ్రీలో భాగంగా హైదరాబాద్ నుంచి కెరియర్ గైడెన్స్ జెండర్ అండ్ ఈక్వటీ అంశాలపై కల్పించుటకు డాక్టర్ స్వప్న, సుష్మ సైంటిస్టు, సీతః కెమిస్ట్రీ పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పెన్షన్ మృతుల పేర్లు తొలగింపు

బోథ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో పెన్షన్ పొందుతూ మరణించిన వారి పేర్లను డీఆర్‌డీఏ అధికారులు పరిశీలించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో డిఆర్డిఏ ఏపీవో శేషారావు మృతుల పేర్లను కంప్యూటర్లో పరిశీలించడం జరిగింది. మృతుల వివరాలను ఆయా గ్రామాల కార్యదర్శులతో అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా మృతి చెందిన వారు 2950 మంది ఉన్నారని, బోథ్ మండలంలో 230 మంది ఉన్నారు. అయితే మృతి చెందిన వారి కుటుంబాలలో అర్హులు ఉంటే వారికి ఈ పెన్షన్ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విధమైన ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

వన్య ప్రాణుల సంరక్షణ కోసం చర్యలు

- సిరిచెల్మ అటవీ క్షేత్రాధికారి నాగవత్ స్వామి
- కవ్వాల్ అభయారణ్యంలో తాగునీరు ఏర్పాటు




పాలవాగు బీట్ పరిధిలోని సాసర్‌ఫిట్‌లో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం



వన్యప్రాణుల కోసం సాసర్‌ఫిట్‌లో నీటిని నింపుతున్న అటవీ శాఖ సిబ్బంది

సిరికొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో కవ్వాల్ అభయారణ్యంలో దాహంతో అల్లాడుతున్న వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ తరపున చర్యలు తీసుకుంటున్నామని సిరిచెల్మ అటవీక్షేత్రాధికారి నాగవత్ స్వామి తెలిపారు. ఈనెల 7న సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అభయారణ్యంలో దాహం దాహం" శీర్షికన ప్రచురితమైన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. జిల్లాలో గత కొన్ని రోజులుగా 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్న వాగులు, చిన్న నీటికుంటలు, చెలిమెలు, చెక్‌డ్యామ్‌లన్నీ చుక్కనీరు లేకుండా పూర్తిగా ఎండిపోయాయి. దీంతో దాహం తీర్చుకునేందుకు వన్యప్రాణులు కిలోమీటర్ల దూరం వెళ్లడంతో వేటగాళ్ల ఉచ్చులో పడి మృత్యువాత పడుతున్నా.. అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో అటవీశాఖ తగిన చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా కవ్వాల్ అటవీ ప్రాంతంలోని సిరికొండ, వాయిపేట్ సెక్షన్ పరిధిలోని పాలవాగు, సాత్మోరీగూడ, భీంపూర్, గోపాల్‌పూర్, బీర్సాయిపేట్ రేంజ్ తదితర బీట్‌ల పరిధిల్లో చెత్తాచెదారంతో నిండిపోయిన సాసర్‌ఫిట్‌లు, నీటితొట్టెలను శుభ్రం చేసి, వాటిలో నీటిట్యాంకర్‌ల చేత మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిరిచెల్మ రేంజ్ అటవీ క్షేత్రాధికారి నాగవత్ స్వామి తెలిపారు. వన్యప్రాణులను వేటగాళ్లు చంపినట్లయితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు సంతోష్, హీరాలాల్, కలేందర్, తదితరులు పాల్గొన్నారు.



బీర్సాయిపేట్ రేంజ్ పరిధిలోని సాసర్‌ఫిట్‌లో నింపిన నీరు



ఆటల్లో గెలుపొందిన క్రీడాకారులతో ఆలయ కమిటీ సభ్యులు

వాయిపేట్‌లో ముగిసిన మహంకాళీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు

- క్రీడాకారులకు బహుమతుల అందజేత

సిరికొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాయిపేట్ గ్రామంలో గత నాలుగు రోజులుగా ఎంతో అంగరంగ వైభవంగా ప్రారంభమైన మహంకాళీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జై మహంకాళీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించగా.. ఆటల్లో గెలుపొందిన విజేతలకు ఆలయ కమిటీ ఛైర్మన్ కినక శంభు మహరాజ్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతీ ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచే క్రీడల్లో ప్రతిభ కనబర్చి, అన్ని స్థాయిల్లో రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెందూర్ గంగాధర్, మాజీ ఎంపీటీసీ పెందూర్ మారుతి, గ్రామపటేల్ పెందూర్ బండు పటేల్, జలపతి, ఇంద్రవెల్లి వ్యవసాయ కమిటీ డైరెక్టర్ ఆనంద్‌రావ్, పెందూర్ భుజంగ్‌రావ్, లక్ష్మణ్ స్వామి, యూత్ అధ్యక్షుడు పోయం బారిక్‌రావ్, కినక పరుశురామ్, క్రీడాకారులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

- అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలి : జిల్లా ఫైర్ ఆఫీసర్ జైత్రాం
- రైల్వే స్టేషన్ వద్ద సిబ్బంది విన్యాసాలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ సిబ్బంది త్యాగాలను తెలియజేయడంలో భాగంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని జిల్లా ఫైర్ ఆఫీసర్ జైత్రాం పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది నీటి విన్యాసాలు చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

ఇచ్చోడ: అగ్ని ప్రమాదాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అగ్నిమాపక శాఖ అధికారి అశోక్ అన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో విడుదల చేశారు. దీనిలో భాగంగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలను అగ్ని మాపక సిబ్బంది నిర్వహించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇచ్చోడలోని అంబేద్కర్ చౌరస్తా, బస్టాండు సమీపంలో అగ్నిమాపక వారోత్సవాలల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌మెన్ దేవేందర్, విజయ్‌కుమార్, అంజు అచ్చుత్‌రెడ్డి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో మార్కెట్ గోదాంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రదర్శనలిస్తూ..